క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ఈద్గా, పోచమ్మకుంట ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మధ్య కోట, తూర్పు కోట, పడమర కోట, చింతల్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీపై దాడిని ఖండిస్తున్నాం

న్యూశాయంపేట: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, హైదరాబాద్ మేడిపల్లిలోని అతని కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ జిల్లా సమన్వయ కర్తలు డి.రాజగోవిందు, మండల పరశురాములు ఒక ప్రకటనలో తెలిపారు. జాగృతి కార్యకర్తల దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వక్తపరిచే ఓ వేదికగా ఉన్న మాధ్యమాలపై దాడులు చేయడం సరికాదని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట పట్టణ శివారులోని సోమిడి ఎఫ్‌సీఐ గోడౌన్ల సమీపంలో గంజాయి క్రయ, విక్రయాలు జరపడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 100 గ్రాముల శుద్ధి చేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎస్సై లవన్ కుమార్ ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని ఇమ్మడి విష్ణువర్ధన్, గండికోట వేణుగోపాల్, పాలడుగుల ఉదయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. ఎస్సై లవన్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ



వరంగల్ చౌరస్తా: వరంగల్ 28వ డివిజన్‌లోని పిన్నావారి వీధిలో పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ గందె కల్పన ఆదివారం పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతాపరుద్ర కాలనీలో ఆదివారం మొక్కలు నాటారు. ఇప్పటికే నాటిన మొక్కల చుట్టూ గుంతలు తీసి నీళ్లు పోశారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు నర్సయ్య, రాపర్తి లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, సత్యం, సునీల్‌రెడ్డి, రాజమౌళి, శంకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్ - ఈద్గాకు సీసీ రోడ్డు



న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని 43వ డివిజన్ లక్ష్మీపురం – ఈద్గా రోడ్డులో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. గత కొన్నేళ్లుగా కంకర పోసి వదిలేయడంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజు, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి స్థానిక నాయకులు, మతపెద్దలు తీసుకెళ్లారు. ఈ మేరకు రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన పారిశుద్ధ్య పనులు

- రోడ్లపైకి మురుగు నీరు
- వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే
- పెద్దమ్మగడ్డ వాసులకు తప్పని తిప్పలు

హన్మకొండ చౌరస్తా: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ చెబుతుండగా.. పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేసి మున్సిపల్ శాఖ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విష జ్వరాలు, జలుబు వంటి వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు వణికిపోతున్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన జీడబ్ల్యూఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

అక్కడంతా పేదలే..

హనుమకొండ 4వ డివజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో సుమారు వెయ్యి మంది జనాభా ఉంటే అధిక శాతం దళితులే నివాసిస్తున్నారు. ఇక్కడ చాలావరకు ప్రజలు పేద, మధ్యతరగతి చెందినవారే. కొద్దిమంది మాత్రమే ఉద్యోగులు ఉంటే మిగిలిన వారంతా కూలీ, ప్రైవేటు ఉద్యోగాలతో కుటుంబాలను సాకుతున్నారు. పెద్దమ్మగడ్డలోని అంతర్గత రోడ్ల వెంట గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడమే కాకుండా చెత్తతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి చిత్తడిగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచి పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించి, డ్రెయినేజీలను శుభ్రం చేయాల్సిన పారిశుద్ధ్య నిర్వహణ మచ్చుకు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



పేరుకుపోయిన చెత్త, నిలిచిన మురుగునీరు



మురుగునీరుతో చిత్తడిగా మారిన రోడ్డు



జనావాసాల మధ్య రోడ్డు పక్కన పెరిగిన గడ్డి



పెద్దమ్మగడ్డ యూపీహెచ్‌సీ ఎదుట నిలిచిన నీరు

హెల్త్‌సెంటర్ ముందు చిత్తడి



పెద్దమ్మగడ్డలోని పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రం ఎదుట మురుగు నీరు నిలిచి ఉండడంతో సెంటర్‌కు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలోని మురుగు నీరుకు మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ నీరు తోడు కావడంతో ఎండా, వానా కాలాలతో సంబంధం లేకుండా నిత్యం చిత్తడిగానే ఉంటోంది. లీకేజీలను అరికట్టి, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బొక్క అశోక్, హెల్త్ సెంటర్ ఉద్యోగి

సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలి



పెద్దమ్మగడ్డలో సైడ్ డ్రెయినేజీలు చాలా ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో అవి శిథిలావస్థకు చేరి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. మురుగు నీటితో దోమలు తీవ్రంగా పెరిగి రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెద్దమ్మగడ్డలో మురుగునీటి కాల్వలు నిర్మించడంతో పాటు చెత్తకుండీలు ఏర్పాటు చేయాలి.

– హన్మకొండ భద్రి, పెద్దమ్మగడ్డ

శబ్దాన్నిచ్చే గన్.. కోతులు పరార్!



కాజీపేట: పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా కోతులతో ప్రజలు అనేక బాధలు పడుతున్నారు. వాటిని తరిమికొట్టేందుకు అనేక ఉపాయాలు చేస్తున్నారు. వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌లోకి అనేక కొత్త పరికరాలు వస్తున్నాయి. హనుమకొండ జిల్లాలో కొంత మంది చిరువ్యాపారులు కోతులను తరిమేందుకు మహారాష్ట్ర నుంచి ప్రత్యేక శబ్దం చేసే గన్నులను తెచ్చి విక్రయిస్తున్నారు. గన్‌లో అమ్మకందారు ఇచ్చే పదార్థాన్ని నింపి బటన్ నొక్కితే నిప్పు కణిక తోడై పొగవచ్చి.. కోతులు భయపడి పారిపోతున్నాయి. దీన్ని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో గన్ సైజ్‌ను బట్టి రూ.200 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. ఈ గన్ నుంచి వెలువడే పొగతో కూడిన శబ్దం కోతులను భయభ్రాంతులకు గురి చేయడమేగాక పరుగెత్తేలా చేస్తుండటం విశేషం.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్యులు, సిబ్బందిని సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు

నయీంనగర్: కాలంతో పోటీపడుతూ నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తలు సేకరించి సమాజానికి అందించే జర్నలిస్టులు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ పెట్టాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం సభ్యులు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు, వైద్యం, మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు, డాక్టర్లు, పోలీసులు సమాజానికి దిక్సూచిలాంటి వారని కొనియాడారు. ఏకశిల ఆస్పత్రి చైర్మన్ కుందూరు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యులు సేవాభావంతో పనిచేస్తారని వారిని జర్నలిస్టులు పాజిటివ్ కోణంలో చూడాలని కోరారు. ఆదివారం వైద్య శిబిరాన్ని వైద్యులు, జర్నలిస్టులతో కలిసి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ప్రారంభించారు. హెల్త్ క్యాంప్‌లో కార్డియాలజిస్టులు మల్లికార్జున్, వివేక్, కూరపాటి మధు, లావణ్య, న్యూరో ఫిజీషియన్లు సాయి కిరణ్, శ్రీచరణ్, ఫిజీషియన్లు మహేష్, గౌతమ్ పాల్గొని వైద్యసేవలు అందించారు. వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బంది, హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, సుబేదారి సీఐ రంజిత్‌ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం, వివిధ యూనియన్ల బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బొల్ల అమర్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు వల్లాల వెంకటరమణ, గాడిపెల్లి మధు, అచ్యుత రఘునాథ్, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ భరోసా’ అమలు చేయాలి



మాట్లాడుతున్న శంకర్

దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

హన్మకొండ: భూమి లేని కూలీలకు ఆర్థిక సహాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని దళిత బహుజన ఫ్రంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్దిదారులను ఎంపిక చేసి మంత్రివర్గ సమావేశంలో చర్చించి దశల వారీగా ఆర్థిక సహాయం అందజేస్తామని ఆశలు కల్పించి విస్మరించడం తగదన్నారు. రాష్ట్రంలో 5.20 లక్షల మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా గుర్తించి కేవలం 83వేల భూమిలేని ఉపాధి హామీ కూలీలకు మొదటి దశ రూ.6 వేలు అందించి చేతులు దులుపుకుందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 67,136 మందిని భూమిలేని కూలీలను గుర్తించి కేవలం 2,581 మందికి మాత్రమే ఆత్మీయ భరోసా కింద మొదటి విడత ఆర్థిక సహాయాన్ని అందజేశారని వివరించారు. ఇంకా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64,500 మందికి వెంటనే ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.38.73 కోట్లు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు పసుల దాసు, జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ పాల్గొన్నారు.

భవానీ నగర్‌లో ఉచిత వైద్యశిబిరం



కళ్లజోడు అందిస్తున్న కార్పొరేటర్ వసంత

హన్మకొండ: హనుమకొండ భవానీ నగర్‌లో ఆదివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. భవాని నగర్ అభివృద్ధి కమిటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోడు అందించారు. 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత, బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్ రెడ్డి, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, భవాని నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ రాంరెడ్డి, దేశిని రాజమొగిలి, అనిల్, జితేందర్, భాస్కర్, ఎక్సైజ్ కాలనీ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, రాజీవ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హర్షం



వెంకట్రామ జంక్షన్‌లో..



హసన్‌పర్తి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ బీసీ ప్రజా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వరంగల్ వెంకట్రామా జంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, రాష్ట్ర నాయకులు బందారి దేవేందర్, గుంటి స్వప్న, చిత్తారి సంజీవ్ కుమార్, రజిత, గుడికందుల వీరేశం, తురాయి రజిని, కొండ హరి, నూనె రవి, పద్మ, నాగుల రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం..

హసన్‌పర్తి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని ఆ పార్టీ 2వ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ వంగపహాడ్‌లో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలం అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్, నాయకులు చంద్రసేనా, దోమ కుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



డిపాజిట్ బాండ్ అందజేస్తున్న బాల్యమిత్రులు

హసన్‌పర్తి: ఇటీవల గుండెపోటుతో మరణించిన హసన్‌పర్తికి చెందిన పోరండ్ల వెంకటేశ్వర్లు కుటుంబానికి బాల్య స్నేహితులు చేయూతనిచ్చారు. ఈ మేరకు 1996 – 97వ బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు రూ.64 వేలు సమకూర్చి మృతుడి కుమారుడి పేరుపై ఆదివారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ బాండ్‌ను మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు ఇమ్మడి రాజేందర్, చాతళ్ల వేణుగోపాల్, పెద్దమ్మ శ్రీనివాస్, ముప్పు అశోక్, సంపత్‌కుమార్, పురుషోత్తం రెడ్డి, కనకస్వామి, శ్రీనివాస్, రజనీకాంత్, యుగంధర్, వంశీ, కుమారస్వామి, బతుకయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



సూర్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

హసన్‌పర్తి: పదవీ విరమణ అనంతరం సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మున్నూరు కాపు సంఘం ఎర్రగట్టు గుట్ట ఏరియా అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సూచించారు. 36 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఆసిఫాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన హసన్‌పర్తికి చెందిన తోట సూర్యనారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు తోట నాగరాజు, ప్రధాన కార్యదర్శి తోట రాజ్యం, కోశాధికారి బండారు సుమన్, సభ్యులు ఉప్పుల సంపత్, ప్రశాంత్, ఆకుల సదానందం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: పని దొరకపోవడంతో మానసిక వేదనకు గురై ఓ ఎలక్ట్రీషియన్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భట్టుపల్లికి చెందిన పైడిపాల రమేష్ (40)కు వారం రోజులు పనిదొరకక పోవడంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై ఈ నెల 8వ తేదీన నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యంతో ముందుకెళ్లాలి

ఆత్మకూరు: లక్ష్యాన్ని నిర్దేశించుకుని యువత ముందుకు సాగాలని సివిల్స్ ఆల్ ఇండియా 11వ ర్యాంకర్ ఇట్టబోయిన సాయిశివాని సూచించారు. నీరుకుళ్ల గ్రామంలో ఆమెను పెరిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సాయిశివాని మాట్లాడుతూ భయాన్ని వీడితే విజయం వరిస్తుందని అన్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఉన్నత విజయాలు సొంతమవుతాయని చెప్పారు. తన అమ్మమ్మ ఊరు నీరుకుళ్లతో తనకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

ఖిలా వరంగల్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన కార్మికులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాధవి, కోశాధికారి వంగూరి రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఉర్సు గుట్ట సీపీఎం జిల్లా కార్యాలయం, రామ సురేందర్ భవనంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎండీ.బషీర్ అహ్మద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ధర్నా, మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించనున్న ధర్నాలకు సీఐటీయూ కార్మిక నేతలు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మహబూబ్, బాబు, ప్రకాష్, బ్రహ్మచారి, కొమురయ్య, కృష్ణ, గున్నాల ప్రభాకర్, వాణి, ఉపేందర్, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

హెచ్‌సీఏను పూర్తిగా రద్దు చేయాలి



మాట్లాడుతున్న మార్నేని ఉదయభానురావు

వరంగల్ స్పోర్ట్స్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కమిటీని పూర్తిగా రద్దు చేయాలని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు డిమాండ్ చేశారు. హనుమకొండలోని రామారావు క్రికెట్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఏళ్లుగా జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని, అప్పుడు ఏనాడూ హెచ్‌సీఏపై ఆరోపణలు రాలేదన్నారు. ప్రస్తుత హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలతో క్రికెటర్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధి, క్రికెటర్లకు మెరుగైన వసతుల కల్పించాలని హెచ్‌సీఏ అనేకమార్లు వినతి పత్రాలు అందజేసినా కంటితుడుపు చర్యలు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం స్థానంలో తెలంగాణ క్రికెట్ సంఘం పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సమావేశంలో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ సంయుక్త కార్యదర్శి బండారి ప్రభాకర్, మాజీ కార్యవర్గ సభ్యుడు మట్టెడ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మతల్లి బోనాలు



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



గుడికి వెళ్తున్న శాకరాశికుంట వాసులు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో మైసమ్మ తల్లి బోనాల పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట, 39, 33వ డివిజన్ల ప్రజలు శాకరాశికుంట కట్టపై మైసమ్మ దేవాలయంలో తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆయా డివిజన్ల మహిళలు డోలు వాయిద్యాల నడమ బోనాన్ని నెత్తిన ఎత్తుకుని మైసమ్మ తల్లికి గుడి చేరారు. దేవుడికి నైవేద్యంగా పరమన్నాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరారు. మైసమ్మకు దర్శించుకుని కోళ్లు, గొర్రె పొటేళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పెన్షనరీ బెనిఫిట్స్ మంజూరు చేయాలి

వరంగల్ చౌరస్తా: ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొంది నెలలు గడిచినా పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించలేదని, తక్షణమే జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్ డిమాండ్ చేశారు. వరంగల్ కాశిబుగ్గ యూనిట్ సమావేశం తుమ్మ వీరయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం వారికి రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్‌తో పాటు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్, జీఐఎస్, టీఎస్‌జీఎల్ఐ నేటికీ విడుదల చేయక పోవడం వలన పలు సమస్యలతో వారు సతమతమై మృతి చెందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన పెన్షనర్ వ్యతిరేక బిల్లును ఉపసంహరించుకోవాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు మదార్, మధుసూదన్ రావు, సుధీర్ బాబు, కుమారస్వామి, సదానందం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ.మదార్ సాహెబ్, గౌరవ అధ్యక్షుడిగా తుమ్మ వీరయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా వోడపల్లి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల యాదగిరి, సభ్యులను ఎన్నుకున్నారు.

బీరన్నస్వామికి తిరుగువారం



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు బీరన్నస్వామికి ఉర్సు కురుమ కులపెద్దలు, కులస్తులు తిరుగువారం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉర్సు బీరన్నస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ మరుపల్ల రవి, భాగ్యలక్ష్మి దంపతులు బీరన్న స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి రోజు బోనం సమర్పించడానికి వీలుపడని కురుమలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గౌడ కోటేశ్వర్, మరుపల్ల గౌతమ్, అన్న రాజేశం, కురుమ సంఘం నాయకులు కోటేశ్వర్, గౌడ శ్రీను, మరుపల్ల ఈశ్వర్ ప్రసాద్, శ్రీనివాస్, కుండె సదానందం, మరుపల్ల శివ, ఆరె రవి, బాలుగు అశోక్ పాల్గొన్నారు.